క్లుప్తంగా

చెస్ బాక్సింగ్ పోటీల విజేతలకు అభినందన



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పరవాడ: చెస్ బాక్సింగ్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ జాతీయ చెస్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో 12 మంది పతకాలు సాధించారు.ఈ సందర్భంగా సత్తా చాటిన విద్యార్థులను సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. క్రిష్ డెవని ,ప్రియాంష్ సింగ్,ఎస్. హరిన్ ,ఐ.కౌశిక్ , కె అభిరామ్ ,ఎల్. సాకేత్ ,బి. తేజశ్రీ , ఎ.నవ్యశ్రీ ,ఎం.హాసిని , జి.హర్షిత , ఎ.హర్షిత, వి.వైష్ణవిలను అంతర్జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారుడు చింతా ప్రతాప్ తదితరులు అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి, సీఈవో కె. నిశాంత్, స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబుతో పాటు కోచ్‌లు మనీష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

రేపటి నుంచి తెలుగు భాషా వారోత్సవాలు

ఏయూ క్యాంపస్: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్ర విశ్వకళాపరిషత్, తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి తెలుగు భాషా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు తెలిపారు. ఆగస్టు 29న కళాప్రపూర్ణ గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని బుధవారం నుంచి 29 వరకు రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులను భాగస్వాములను చేస్తూ వివిధ మేధోపోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 23న వ్యాసరచన పోటీలు, 24న వక్తృత్వ పోటీలు, 25న పద్యపఠనం, 26న తెలుగు భాషా సాహిత్యాలపై క్విజ్, 27న నిష్ణాతులైన భాషా సాహిత్యవేత్తలతో చర్చా గోష్ఠి, 28న సోమవారం గిడుగు రామమూర్తి రచనలపై ఉపన్యాసాలు, 29న ముగింపు కార్యక్రమం ఉంటాయని తెలియజేశారు. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విశిష్ట అతిథులుగా ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య జి.యోహాన్ బాబు, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ డి.వి సూర్యారావు, పరవస్తు ఫణిశయనసూరి హాజరవుతారని వివరించారు.

అంకుర సంస్థలకు ఆ హబ్ ఆర్థిక సహకారం

ఏయూక్యాంపస్: యువత స్థాపించి, నిర్వహిస్తున్న అంకుర సంస్థలు (స్టార్టప్)లకు ఆర్థిక సహకారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఏయూ ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరపు ఒక ప్రకటనలో తెలిపారు. భారత శాస్త్ర సాంకేతిక విభాగం ఏర్పాటు చేసిన నిధి పథకంలో భాగంగా యువత ఆలోచనలు ఆవిష్కరణలు గా, ఉత్పత్తులుగా మార్చడానికి అవసరమైన మూలధనం పెట్టుబడిని అందిస్తామని పేర్కొన్నారు. పథకంలో భాగంగా కనిష్ఠంగా రూ.2 లక్షలు, గరిష్ఠంగా రూ.10 లక్షలు అందిస్తామని తెలిపారు. టెక్నాలజీ, సైన్స్ ఆధారంగా పనిచేసే అంకుర సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ఫొటోటైప్ ఉత్పత్తిని 12 నెలల్లో తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. దీనికి ఐవోటీ అనుసంధానం తప్పనిసరి అన్నారు. పూర్తి వివరాలకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని ఆ హబ్‌లో నెలకొల్పిన ఏయూ నిధి ఐటీబీఐ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్ : ప్రముఖ చలన చిత్ర కథానాయకు లు చిరంజీవి, బాలకృష్ణ నటించిన పలు చిత్రాల గీతాలతో సోమవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. స్వర గీతిక సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కళారంగ ప్రముఖులు భయ్యా శ్రీనివాస్, సన్‌మూర్తి, సంస్థ వ్యవస్థాపకుడు రాజారావు, శ్యాంసుందర్ ప్రారంభించారు. లోకేష్ ట్రాక్స్ సహకారం అందివ్వగా, లక్ష్మీ స్వరూప వ్యాఖ్యానం చేశారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు మహదేవ మూర్తి, బొమ్మిడి సత్యనారాయణ, కేవీఎల్ రావు, వేణుగోపాల్, వీవీఎస్ మూర్తి, జిలాని, శ్యాంసుందర్, రామ్ కుమార్, మాధవ్, వెంకటేష్, అభినయ్, మాధురి, లక్ష్మీ సాత్విక, గౌరీ, సుజాత, లాయర్ శ్రీదేవి, లక్ష్మీ స్వరూప గీతాలాపన చేశారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

- గ్రామ, వార్డు సచివాలయాల్లో 4 రోజుల పాటు నిర్వహణ
- పదేళ్ల వ్యవధిలో ఒక్కసారైనా ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకోవాలి
- ప్రత్యేక క్యాంపులో కొత్త ఆధార్ నమోదు, మార్పులు, చేర్పుల సేవలు

ఇప్పుడు ఏ పని జరగాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలన్నా, ఉద్యోగాలు దక్కించుకోవాలన్నా, కళాశాలల్లో చేరాలన్నా, బ్యాంకుల్లో ఖాతాలు తెరవాలన్నా.. ఒకటేమిటి సమస్త కార్యకలాపాలకు ఆధార్ కార్డు ఉండాల్సిందే. అది కూడా అప్‌డేటెడ్‌గా ఉండాలి. అయితే చాలా మంది ఆధార్ కార్డు ఎప్పుడో పొందినా తర్వాత దాని గురించి పట్టించుకోరు. అలాగే పొరపాట్లు, సవరణలు, మార్పులు చేయించుకోరు. దీనివల్ల అత్యవసర సమయాల్లో ఇబ్బందులు తప్పవు. ఇలాంటి వాటిని నిరోధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తోంది. ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకుని ఆధార్‌లో మార్పులు, చేర్పులు, కొత్తగా ఆధార్‌కు దరఖాస్తు వంటివి ఈ క్యాంపుల్లో చేసుకోవచ్చు.

దాబాగార్డెన్స్ : గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ నెల 22 నుంచి నాలుగు రోజుల పాటు ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఆధార్ కీలకంగా మారిన నేపథ్యంలో ఆధార్‌లో తప్పుల కారణంగా అర్హులెవరూ ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఈ నెల 22 నుంచి 25 వరకు ఈ ప్రత్యేక క్యాంపులు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. నియోజకవర్గాల వారీగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ క్యాంపులు ఉంటాయి. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు జారీ చేశారు.

కనీసం పదేళ్లకోసారైనా..

ప్రతి ఒక్కరూ కనీసం పదేళ్ల వ్యవధిలో ఒక్కసారైనా తమ ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకోవాలని కార్డుల జారీ సంస్థ యూఐడీఏఐ కొత్తగా నిబంధనలు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఆధార్ అనుసంధానంతో కూడిన కార్యక్రమాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలంటే వివరాలను తాజాగా అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. గత పదేళ్లలో ఒక్కసారి కూడా తమ వివరాలు అప్‌డేట్ చేసుకోని వారు నియోజకవర్గ పరిధిలో అనేక మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో వీరితో పాటు కొత్తగా ఆధార్ నమోదు, ఇతర మార్పులు, చేర్పుల సేవలు అందజేసేందుకు ఈ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నారు. ఎక్కువ మంది క్యాంపులను వినియోగించుకుని ఆధార్ సేవలు పొందేలా చూడనున్నారు. నియోజకవర్గ పరిధిల్లో సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నారు.



ఆధార్ కేంద్రం వద్ద వినియోగదారుల రద్దీ (ఫైల్)

సంక్షేమాన్ని వివరించి.. సమస్యలు తెలుసుకుని..



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సేనాతివానిపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

సింహాచలం: ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు స్థానిక సమస్యలు తెలుసుకున్నారు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్. జీవీఎంసీ 94వ వార్డు పరిధి సేనాతివానిపాలెంలో సోమవారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండు కళ్లుగాచేసుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పెందుర్తి మార్కెట్ కమిటీ వైస్ చెర్మన్ బళ్ల రాంబాబు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు సూరిశెట్టి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ కౌంటర్ ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ జోన్-8 జోనల్ కార్యాలయంలో స్మార్ట్‌సిటీ కౌంటర్‌ను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం 6 కౌంటర్లను సుమారు. 38 లక్షలతో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వినియోగదారులు క్యూలో ఎక్కువసేపు నిలబడకుండా త్వరితగతిన పని ముగించుకుని వెళ్లేందుకు ఈ సదుపాయం కల్పించినట్టు చెప్పారు. కార్యక్రమంలో 95వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, పెందుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కోడిగుడ్ల దేవి సాంబ, మండల పార్టీ అధ్యక్షుడు నక్క నకరాజు, సీనియర్ నాయకులు ఆదిరెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల ప్రతిభా పోటీలు రేపు



ప్రతిభా పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ తదితరులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 23న అంతర్ కళాశాలల ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, ద్వితీయ భాషా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ పి.కె.జయలక్ష్మి తెలిపారు. సోమవారం కళాశాల ఆవరణలో పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో భావవ్యక్తీకరణ కౌశలం, ప్రతిభా పాటవాలను ప్రోత్సహించే ఉద్దేశంతో రెండేళ్లుగా ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విశాఖలోని అనేక డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. వక్తృత్వం, చిత్రలేఖనం , గీతాలాపన, వ్యాసరచన, కథలు తదితర విభాగాల్లో తెలుగు, హిందీ, ఆంగ్ల మాధ్యమాల్లో పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు జ్ఞాపికలు, ప్రమాణ పత్రాలు అందిస్తామన్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నిర్మల, డాక్టర్ దీప్తి, సిస్టర్ జైన్, కోటేశ్వరరావు, గౌరీనాయుడు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నమో శివరుద్రాయ



ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో సోమ వారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామికి బిల్వ పత్రాలతో పూజలు చేశారు. మహిళలు ఉమాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమపూజలు విశేషంగా నిర్వహించారు. అర్చకులు పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు.

కల్యాణం .. కమనీయం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలలు అందజేశారు.

విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలపై సంతృప్తి



విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో-2 సూర్యనారాయణమూర్తి

సబ్బవరం: మండలంలోని వంగలి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఎంవో-2 బి. సూర్యనారాయణమూర్తి సోమవారం సందర్శించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను, అభ్యాసనా సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా.. లేదా అని ఆరా తీశారు. వంటశాల నిర్వాహణను పరిశీలించారు. నాడు-నేడు తొలివిడతలో పాఠశాలను అభివృద్ధి చేయడంతో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులు ఉన్నాయన్నారు. పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకూ 115 మంది విద్యార్థులు విద్యనభ్యసించగా సోమవారం 103 మంది విద్యార్థులు తరగతులకు హాజరైనట్టు ఎంఈవో తెలిపారు.

గోవును పూజిస్తే ముక్కోటి దేవతలను పూజించినట్టే..



గోశాలలోని గోవులకు బెల్లం, అరటిపళ్లు అందజేస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యుడు శ్రీనివాసరావు

సింహాచలం: గోవు లక్ష్మీదేవి స్వరూపమని, గోవును పూజిస్తే ముక్కోటి దేవతలను పూజించినట్టేనని సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు, సంపంగి శ్రీనివాసరావు అన్నారు. శ్రావణ సోమవారం, నాగ పంచమిని పురస్కరించుకుని శ్రీకృష్ణాపురంలోని గోశాలలోని గోవులకు 200కిలోల బెల్లం, అరటి పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవు హిందువులకు ఆరాధ్యదైవమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గోసంరక్షణకు పెద్ద పీటవేశారన్నారు. ఇక నుంచీ ప్రతీనెల 200 కిలోల బెల్లం, అరటిపళ్లు గోశాలకు అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు సహకరించండి

మేయర్ హరి వెంకటకుమారి



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి చేరుకుంటున్న మేయర్



తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్

దాబాగార్డెన్స్ : కాలుష్య నియంత్రణ మన సామాజిక బాధ్యత అని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తన సొంత వాహనం వదిలి క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బంది వినియోగించేలా చూడాలన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలన్నారు.

'హనుమంత'వాక సార్థకమయ్యేలా..

- జంక్షన్‌కు చిరస్థాయి ఖ్యాతి
- మేయర్ హరివెంకట కుమారి
- 40 అడుగుల ఎత్తు గల హనుమాన్ విగ్రహావిష్కరణ



హనుమంతుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ తదితరులు

ఏయూక్యాంపస్: హనుమంతవాక జంక్షన్ పేరు చిరస్థాయిగా నిలిచే మంచి కార్యక్రమాన్ని నేడు చేపట్టామని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. జంక్షన్‌లో భారీ హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని హనుమంతవాక జంక్షన్ వద్ద సుమారు 40అడుగుల ఎత్తు గల హనుమంతుడి విగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ కోరుకొండ వెంకటరత్న స్వాతితో కలసి మేయర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటి కౌన్సిల్‌లో హనుమంతవాక జంక్షన్‌లో హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేయాలని తీర్మానించామన్నారు. దాని ప్రకారం సుమారు 60 లక్షల రూపాయల వ్యయంతో సంజీవ పర్వతంతో కూడిన హనుమాన్ విగ్రహం, వాటర్ ఫౌంటెన్, ఎల్ఈడీ లైట్లతో పాటు భక్తులకు ఆహ్లాదం కలిగించే విధంగా ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేశామని చెప్పారు. రామ నామాన్ని స్మరించే ప్రాంతంలో తప్పకుండా హనుమ ఉంటారని భక్తుల విశ్వాసమని, చిరంజీవి అయిన హనుమ శ్రీరామచంద్రుని భక్తులను ఎల్లవేళలా కాపాడుతారని అన్నారు.

వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ హనుమంతవాక నుంచి సింహాచలం వెళ్లే మార్గంలో హనుమంతుడి విగ్రహం ప్రజలకు ఎంతో శక్తిని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్, కార్యనిర్వాహక ఇంజినీర్ ప్రసాద్, సహాయక ఇంజినీర్ సురేష్ పాల్గొన్నారు.

24న మెగా జాబ్ మేళా

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సమీపంలోని గొన్నా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఈ నెల 24వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు గొన్నా విద్యా సంస్థల కార్యదర్శి గొన్నా హేమచంద్ నాయుడు తెలిపారు. కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళాశాల వ్యవస్థాపకుడు, దివంగత జీబీ నాయుడు 48వ జయంతిని పురస్కరించుకుని ఈ మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. హనీ గ్రూప్, డెక్కన్ కెమికల్స్, అపోలో ఫార్మా, జియో ఫైబర్, యోకోహామా, ఎస్ఐటీ, ఐసీఐసీఐ, జయభేరి ఆటోమోటివ్స్, వరుణ్ బజాజ్, పవర్ రివ్యూస్, ఎస్ఆర్ కంట్రోల్, ఆటోమిషన్స్, టాటా స్ట్రయివ్, టీజీ ఇండియా లిమిటెడ్, ముథూట్ ఫైనాన్స్ కంపెనీల్లో పోస్టుల భర్తీకి ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ పోస్టులకు ఎంటెక్, బీటెక్, ఎంబీఏ, పీజీ, ఫార్మసీ, డిప్లమో, ఇంటర్, పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 96428 29352, 98857 84543 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మహిళా కళాశాలలో స్టూడెంట్ ఇండక్షన్



ఇండక్షన్ కార్యక్రమంలో విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

దాబాగార్డెన్స్ : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థినులకు సోమవారం స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి నిర్వహించారు. కళాశాల ఆవరణ, మౌలిక సదుపాయాలు, సంస్కృతిని ఈ సందర్భంగా పరిచయం చేశారు. ఈ కార్యక్రమం సీనియర్ విద్యార్థులు, అధ్యాపకులతో సత్సంబంధాలు ఏర్పరచుకోవడానికి సహాయం చేస్తుందని ప్రిన్సిపాల్ వివరించారు. తొలి రోజు కార్యక్రమంలో భాగంగా అధ్యాపకుల ద్వారా ఫ్రెషర్స్‌కు స్వాగతం పలకడం, విద్యార్థినులకు సంబంధిత సిబ్బందితో పరిచయ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సంస్థ దృక్పథం, సంస్థాగత విధానాలు, విలువలతో కూడిన విద్య గురించి తెలిపారు. ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి. అరుణపద్మ నేతృత్వంలో ఎన్ఈపీ, సీబీసీఎస్ నిర్మాణం, సింగిల్ మేజర్ సిస్టమ్‌లోని పాఠ్యాంశాలు, మూల్యాంకన విధానాల గురించి వివరించారు. కెమిస్ట్రీ విభాగాధిపతి సంతోషి అనూష విద్యార్థులకు ప్రవర్తనా నియమావళి గురించి తెలపగా, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్మయి, లైబ్రేరియన్ డాక్టర్ ఎ. ధరణి కళాశాల ఆవరణలో గల వివిధ విభాగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమం 21 రోజుల పాటు కొనసాగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటాం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లోను కాపాడుకుంటామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మికుల పోరాట శక్తికి ఎదురు లేదని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 921వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్-2 విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మేస్తానని ప్రకటించడం ప్రభుత్వ నిరంకుశత్వ పాలనకు నిదర్శనమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా చేయాలని దేశ ప్రజలు, కార్మికవర్గం, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు గట్టి పట్టుదలతో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసే ప్రకటనలతో కార్మికులు బెదిరేది లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ఐక్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

మేడ పైనుంచి జారిపడిన బాలుడి మృతి

సీతమ్మధార: మేడపై ఆడుకుంటూ అదుపు తప్పి కిందపడిన బాలుడు మృతి చెందిన ఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం అబిద్‌నగర్ మసీద్ దరి తండ్రి రామారావు, తల్లి అరుణ, కుమారుడు ధక్షిక్(9) నివసిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా లావేరు గ్రామం నుంచి పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చి ఉంటున్నారు. జ్ఞాన నికేతన్ స్కూల్‌లో ధక్షిక్ నాలుగో తరగతి చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం మేడపై ఆడుకుంటూ కాలు జారి కింద పడిపోవడంతో ధక్షిక్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని తల్లిదండ్రులు కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం బాబు మృతిచెందాడు. తండ్రి రామారావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ గౌరి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



ఫ్లైఓవర్‌పై వై జంక్షన్ వద్ద పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

ఆనందపురం : ఆనందపురం జంక్షన్‌లోని ఫ్లైఓవర్‌పై గల వై జంక్షన్‌ను ట్రాఫిక్, శాంతి భద్రతల విభాగం అధికారులు సోమవారం సాయంత్రం పరిశీలించారు. శాంతి భద్రతల విభాగం డీసీపీ - 1 వి.విద్యాసాగర్ నాయుడు, ట్రాఫిక్ ఏసీపీ జాన్ మనోహర్, ఏడీసీపీ జి.శ్రీనివాసరావు, ఆనందపురం సీఐ రామచంద్ర రావు, ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్ జాతీయ రహదారిపై పర్యటించి వాహనాల రాకపోకలను పరిశీలించారు. ముఖ్యంగా విజయనగరం, శ్రీకాకుళం, తగరపువలస ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు... ఇక్కడి వై జంక్షన్ వద్ద విశాఖ వెళ్లే వాహనాలు ఎడమవైపు రహదారిలోకి, పెందుర్తి, అనకాపల్లి వెళ్లే వాహనాలు కుడివైపు గల రహదారి గుండా ప్రయాణించాల్సి ఉంది. కానీ ఇక్కడ సరైన సూచికలు గానీ, నియంత్రించేందుకు సిబ్బంది లేకపోవడంతో అంతా గందరగోళంగా మారతోంది. దీంతో విశాఖ వెళ్లాల్సిన చాలా మంది వాహనదారులు తికమకకు గురై పెందుర్తి మార్గంలోకి ప్రవేశిస్తున్నారు. చాలా దూరం వెళ్లిన తర్వాతగానీ వారికి అసలు విషయం తెలియడం లేదు. దీంతో వారు మరలా అదే మార్గంలో వెనక్కి రావడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఇటీవల ఇక్కడ ఇలాగే రెండు మూడు ప్రమాదాలు కూడా జరిగాయి. దీంతో పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇక్కడ ట్రాఫిక్‌ను పూర్తి స్థాయిలో క్రమబద్ధీకరించడానికి నిర్ణయించారు. ఈ మేరకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రత్యేకించి వాహనదారులకు రవాణా మార్గాలపై పూర్తిగా అవగాహన కలిగేవిధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు వెల్లడించారు.